క్లుప్తంగా

డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్ పోస్టర్ల ఆవిష్కరణ నేడు



అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయటౌన్: అరకులోయ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈనెల 28న వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ చేయనున్నట్టు అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గం పరిధిలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ జిల్లా, మండల అనుబంధ విభాగాల్లో ఉన్న అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఎమ్మెల్యే మత్స్యలింగం పిలుపునిచ్చారు.

పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలి



సూచనలిస్తున్న ఎంపీడీవో కుమార్

అడ్డతీగల: ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని ఎంపీడీవో ఎ.వి.వి. కుమార్ అన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వహణలో కీలకమైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. ఆదికర్మ యోగి అభియాన్ కింద గ్రామాలు ఎంపిక చేయడం జరిగిందన్నారు. అక్టోబర్ 3 నుంచి ఆయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న పలు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిర్వహణపై సమీక్షించారు.

మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఆకుల వెంకట రామారావు

ఎటపాక: గోదావరి వరదలకు తీవ్రంగా నష్టపోయిన మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆకుల వెంకటరామారావు శనివారం కోరారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో గౌరిదేవిపేట, నందిగామ, మురుమూరు వాగుల పరీవాక ప్రాంతాల్లో వందల ఎకరాల్లో మిర్చి నీట మునిగి పోయిందన్నారు. గత మూడుళ్లుగా మిర్చి సాగులో తీవ్ర నష్టాలను భరిస్తున్న రైతులను ఇప్పుడు గోదావరి వరదలు కోలుకోలేని విధంగా చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎకరాకు రూ.20వేల వరకు పెట్టుబడులు పెట్టారన్నారు. వరదలతో పంట నష్టాలను వ్యవసాయాధికారులు అంచనా వేసి ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు.


దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రసాద్

కొయ్యూరు: పెదమాకవరంలో నిర్మాణం చేస్తున్న మోదకొండమ్మ ఆలయానికి సంబంధించి గర్భగుడి సింహాద్వారం పనులను శనివారం చేపట్టారు. దీనిలో ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డి.వి.డి.ప్రసాద్ పాల్గొన్నారు.అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటకు చెందిన కామాక్షి వీరబ్రహ్మేంద్ర వడ్రంగి పనివాళ్ల సంఘం ఇచ్చిన సింహద్వారాన్ని వేద మంత్రాల నడుమ ప్రసాద్ దంపతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 30 మంది అర్చకులకు ధూప దీప నైవేద్యాలను అందజేశారు. ఇందులో భాగంగా ప్రసాద్, గౌరి దంపతులు చీరలను వృద్ధులకు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్ష కార్యదర్శులు సంపరి శివకుమార్, డి.పద్మరాజు, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చల మంగతల్లి, స్థలదాత రాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపాత్రుడుకి అభినందనలు



మినుముల గోపాలపాత్రుడు

పాడేరు: మేరా యువ భారత్ జిల్లా సెలక్షన్ కమిటీ సభ్యుడిగా హుకుంపేట మండలం మఠం గన్నేరు పుట్టు గ్రామానికి చెందిన బీజేపీ నేత మినుముల గోపాలపాత్రుడు నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర యువజన సర్వీసులు, కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ సీఈవో నుంచి అధికారిక ఉత్తర్వుల అందినట్టు గోపాలపాత్రుడు వెల్లడించారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో తనకు అవకాశం కల్పించడం సంతోషంగా ఉందని తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని గోపాలపాత్రుడు చెప్పారు. తనకు అవకాశం కల్పించిన బీజేపీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

మూగజీవాలకు సీజనల్ ముప్పు

- వ్యాధులపై అప్రమత్తత అవసరం
- టీకాలు వేయించకుంటే తీవ్ర నష్టం
- సూచనలు, సలహాలు పాటించాలంటున్న పశు వైద్యాధికారులు



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది (ఫైల్)

సీలేరు: వాతావరణంలో మార్పులు రావడంతో పాటు ఉపరితల ఆవర్తనంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని వర్షాలు విరివిగా కురుస్తున్నాయి. ఈ సీజన్‌లో మూగజీవాలకు సీజనల్ వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పెంపకందారులు నష్టపోవాల్సి వస్తుందని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. గూడెంకొత్త వీధి మండలంలోని పశు వైద్యశాల పరిధిలో గొర్రెలు, మేకులు, ఆవులు, గేదెలు, కోళ్లు వేలాది సంఖ్యలో ఉన్నాయి. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో మూగజీవాలకు సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. వర్షాల కారణంగా మూగజీవాల్లో ముఖ్యంగా నీలి నాలుక, థైలేరియాసిస్, గాలికుంటు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. సకాలంలో వ్యాధులను గుర్తించకపోతే పెంపకందారులు తీవ్రంగా నష్టపోవాల్సిందే. కాబట్టి పెంపకం దారులు పశు వైద్యాధికారులు సూచనలు, సలహాలు పాటిస్తే జీవాలను వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు.



సీలేరులో గుంపుగా తిరుగుతున్న పశువులు

నీలి నాలుక వ్యాధి లక్షణాలు, నివారణ..

గొర్రెలలో నీలి నాలుక వ్యాధి చాలా ప్రమాదకరమైనది. ఇది వైరస్ వ్యాధి, క్యూలికాయిడ్స్ అనే దోమ జాతికి చెందిన కీటకాల ద్వారా ఒక గొర్రె నుంచి మరో గొర్రెకు వ్యాపిస్తుంది. టీకాలు వేయకుంటే వ్యాధి తీవ్రత కూడా ఎక్కువగా ఉండి గొర్రెలు చనిపోయే ప్రమాదం ఉంది. 105 నుంచి 106 డిగ్రీల జ్వరం ఉండి నోటిలో పుండ్లు ఏర్పడి చొంగ కారుతుంది. నోరు మొత్తం ఎర్రగా మారుతుంది. చొంగసురగలా మారి పెదవులు, చిగుళ్లు, నాలుక వాచిపోతాయి. నాలుక చివరలో నీలిరంగు వస్తుంది. కాళ్ల గిట్టల చుట్టూ వాచి పుండ్లు ఏర్పడతాయి. ఆహారం తీసుకోక పోవడంతో ఆరోగ్యం క్షీణించి వారం రోజుల్లో మృత్యువాత పడతాయి.

నివారణ.. వ్యాధి సోకిన గొర్రెలను సకాలంలో గుర్తించి పశువైద్యులతో చికిత్స చేయించాలి. నోటి పుండ్లను ఒక శాతం బోరిక్ యాసిడ్‌తో శుభ్రం చేయాలి. గొర్రెల ఆకలి తీర్చేందుకు జావ లాంటివి తాగించాలి. గిట్టల చుట్టూ ఉన్న పుండ్లను కడిగి హిమాక్స్, నీమ్వెంట్ వంటి ఆయింట్‌మెంట్లు పూయాలి. యాంటిబయాటిక్ ఇంజెక్షన్లు ఇప్పించాలి. దోమల నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచి వేపాకు పొగ పెట్టాలి. వ్యాధినిరోధక శక్తి పెరిగేందుకు విటమిన్–సి ఇంజెక్షన్ వేయాలి.

థైలేరియాసిస్..

ఈ వ్యాధి ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు వంటి పశువులకు వస్తుంది. పరాన్నజీవికి చెందిన గోమార్లు, పిడుదులవలన ఈ వ్యాధి సోకుతుంది. 6 నుంచి 12 నెలల వయసు ఉన్న పశువులు ఈ వ్యాధిబారిన పడతాయి. పరాన్న జీవులు మూగజీవాల రక్తకణాల్లో ఆవాసం ఏర్పరుచుకోవడంతో రక్తకణాలు పగిలి మృత్యువాత పడతాయి. ఈ వ్యాధి సోకిన పశువులకు తీవ్ర జ్వరం, ముక్కు నుంచి సురగ కారడం, శ్వాస తీసుకోవడం కష్టం అవుతుంది. తరచుగా దగ్గడంతో పాటు కళ్లు ఎర్రగా మారుతాయి. మేత తినవు, నెమరువేయవు. రక్తం,బంక విరేచనాలు అవుతాయి. పాల ఉత్పత్తి తగ్గుతుంది.

గాలికుంటు వ్యాధి..

గాలికుంటు వ్యాధి అఫ్లోవైరస్ పికోర్న జాతికి చెందిన వైరస్ వలన వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి సగానికి తగ్గిపోతుంది. నోరు, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి పశువులు కుంటుతూ మేతమేయవు, నెమరు వేయవు. 104 నుండి 106 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటి నుంచి చొంగ కారుతుంది. ఆడ పశువుల్లో వంధ్యత్వం ఏర్పడుతుంది. ఈ వ్యాధికి సరైన చికిత్స లేదు. వ్యాధి సోకకుండా గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలి.

నివారణ.. వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరుచేయాలి.పశువుల కొట్టంలో పురుగుమందులు కొట్టాలి. పశువుల పాకలో మురుగు, తేను లేకుండా చూసుకోవాలి. పశువులకు టెట్రాసైక్లిన్, ప్రోటోమిన్ మందులతో పాటు ఐరన్ ఇంజెక్షన్లు వాడాలి.

టీకాలు తప్పనిసరి

మూగజీవాల పెంపకందారులు సకాలంలో టీకాలు వేయించడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి పశువులను రక్షించుకోవచ్చు. చలికాలంలో అధికంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. జీవాలను గమనిస్తూ ఏదైనా సమస్య ఉంటే పశువైద్యులను సంప్రదించాలి.

–డాక్టర్ రమేష్ ఇన్‌చార్జి పశువైద్యాధికారి, సీలేరు



అక్రమ నిల్వ ఇసుక స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఇసుక వద్ద రెవెన్యూ సిబ్బంది

డుంబ్రిగుడ: అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకుని జైపూర్ జంక్షన్ సమీపంలోని ప్రభుత్వం నిర్మిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ నూతన భవనంలోకి తరలించినట్టు తహసీల్దార్ త్రివేణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శనివారం అరకు పంచాయతీ జైపూర్ జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో ఇసుకను నిల్వ చేసి ఉన్న విషయం తెలుసుకుని తమ సిబ్బందితో చేరుకొని సుమారు 7 యూనిట్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నామన్నారు. పాడేరు ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ ఆదేశాల మేరకు నూతన భవనంలో తరలించి , అక్రమ ఇసుక రవాణ దారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక నిల్వలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆర్ఐ రాము, రెవెన్యూ సిబ్బంది కోటి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు సూచనలు

మాడుగుల రూరల్ : ఖరీఫ్ వరి పంటకు చీడపీడలు సోకాయి. వరి నాట్లు వేసి నెల రోజులు పూర్తి అయ్యాయి. పంటకు దోమపోటు, పాచి తెగులు సోకాయి. దీంతో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. వరి పనల మీద ఎర్రగా ఉండడంతో వీటి నివారణకు ఎచెపెట్, హెక్సకోనజోల్, మందులు మిశ్రమాన్ని నీటిలో కలిపి పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి ఎం. అనసూయ తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం అవసరం



వనుగుమ్మలోని మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది

ముంచంగిపుట్టు: మహిళలు పౌష్టికాహారంపై పూర్తిగా దృష్టి పెట్టాలని వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి అన్నారు. మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో శనివారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 163 మందికి వైద్య సేవలు అందించారు. 24 మంది గర్భిణులు, 19 మంది బాలింతలకు ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు అందించారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహరంపై అవగాహన ర్యాలీని చేశారు. పోషక విలువల సరకులు పెట్టి వాటి వల్ల ఉపయోగాలను తెలియజేశారు.ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ భాగ్యవతి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, వైద్యుల సూచనాలు తప్పకుండా అనుసరించాలని, ఆస్పత్రిలోనే ప్రసవాలు చేసుకోవాలని, ఇళ్ల వద్ద ప్రసవాలు వలన తల్లిబిడ్డకు ప్రమాదమన్నారు. వైద్యాధికారి శ్యాం ప్రసాద్, సీఐటీయూ మండల కార్యదర్శి శంకర్ రావు, 104 డిఈవో కృష్ణవేణి, పైలట్ గణపతిరాజు, లబ్బూరు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ తదితరులు పాల్గొన్నారు.



కొయ్యూరులో పోషకాహార స్టాల్ వద్ద అంగన్‌వాడీ సిబ్బంది

కొయ్యూరు: మంప, కొండగోకిరిలో శనివారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు కలిసి పోషణ మహా కార్యక్రమాలను నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు అక్కడకు తీసుకువచ్చి పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. బలమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. రక్తహీనత నివారణకు వీలుగా ఆకుకూరలు అధికంగా తీసుకోవాలని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

కూనవరం: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని కోతులగుట్ట సీహెచ్‌సీలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో మహిళల పాత్ర ఎంతో కీలకం అన్నారు. ప్రతీ కుటుంబంలో స్త్రీలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ పాయం రంగమ్మ, డాక్టర్‌లు శశికళ, షమీనా, తేజ, చంద్రశేఖర్, కాంతికిరణ్ కిషోర్, వైఎస్ ఎంపీపీ బండారు సాంబశివరావు, నాయకులు వైభాస్కర్‌రావు, జీ ప్రసాద్, ఎస్ రామారావు, సీహెచ్ ఉమామహేశ్వరరావు, ఎచ్చు రవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోతులగుట్ట సీహెచ్‌సీలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్‌బాబు



పిసిరిమామిడి అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ లక్ష్మి

చింతపల్లి: గర్భిణీలు బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతో మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చునని అన్నవరం క్లస్టర్ సూపర్‌వైజర్ లక్ష్మి అన్నారు. అన్నవరం క్లస్టర్ పరిధిలో చెరుకుంపాకలు, తురుతుంపాడు, లింగాలగుడి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషన్ మా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పక తీసుకోవాలన్నారు. అంగన్‌వాడి కార్యకర్తలు పెంటమ్మ, సన్యాసమ్మ , ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భారీ లారీలు ప్రవేశిస్తే సీజ్ చేస్తాం

రంపచోడవరం ఆర్డీవో రాజేశ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

రాజవొమ్మంగి: జామాయిల్ తదితర కలపను పరిమితికి మించి లారీల్లో లోడ్ చేసి రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఆర్డీవో రాజేశ్ కుమార్ అన్నారు. అలాగే అతి పెద్ద లారీలు లోతట్టు గ్రామాల్లోకి అనుమతి లేదని, ట్రాక్టర్ల ద్వారా కలప ప్రధాన రహదారికి ముందే చేర్చుకొని భారీ వాహనాల్లోకి ఎక్కించుకోవాలని సూచించారు. భారీ వాహనాలతో రోడ్లు పాడు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. 'దారుణ దారులు' శీర్షికతో శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.

ఇందులో భాగంగా డీటీవో ప్రకాశ్ ఆదేశాల మేరకు శనివారం జామాయిల్ కలప లోడ్ అవుతున్న ప్రాంతానికి అధికారులు వచ్చి తనిఖీ చేశారు. లారీలో కలప లోడింగ్‌పై ఫారెస్టు సిబ్బంది, కలప రవాణా కాంట్రాక్టర్లకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. భారీ వాహనాల వల్ల బడనాంపల్లి, అప్పలరాజుపేట గ్రామాల్లో ఛిద్రమైన బీటీ రహదారులను ఆయన పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.



రాజవొమ్మంగిలో లారీలను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేశ్ కుమార్

రూ. 76,760 అపరాధ రుసుం

రంపచోడవరం ఆర్డీవో రాజేశ్‌కుమార్ శనివారం రాజవొమ్మంగిలో జాతీయ రహదారిపై తిరుగుతున్న వాహనాలను అడ్డగించి చెక్ చేశారు. నిబంధనలు అతిక్రమించిన, రికార్డులు లేని 11 మంది వాహనయజమానుల నుంచి రూ.76, 760 అపరాధ రుసుము వసూలు చేసామన్నారు. ద్విచక్రవాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. మైనర్ల వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన ఆయన హెచ్చరించారు.

సీలేరులో భారీ వర్షం

సీలేరు: అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అల్లూరి సీతారామరాజు జిల్లా దారాలమ్మ తల్లి ఘాట్ రోడ్‌లో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి.గత మూడు రోజులుగా ఈ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఘాట్ రోడ్‌లో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఘాట్ రోడ్ అంతా పెద్దపెద్ద గోతులు గా మారి అందులో నీరు చేరి వాహనాలు నిలిచిపోయే పరిస్థితికి వచ్చింది. శనివారం ఉదయం నుంచి ఈ ప్రాంతంలో ఎడతెరుపి లేకుండా భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వ్యవసాయానికి మేలు చేస్తాయని గిరిజన రైతులు చెబుతున్నారు.



దారకొండలో కురుస్తున్న వర్షం

రహదారి సమస్యపై గ్రామస్తుల వినతి



అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణికి వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు



గ్రామస్తులు అందజేసిన వినతులను పరిశీలిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సమీపంలో గల దేవునిగెడ్డవీధిలో సీసీ రోడ్డు మంజూరు చేయాలని శనివారం అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజరాణి, పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు గ్రామస్తులు వినతి పత్రాలను అందజేశారు. దేవునిగెడ్డవీధిలో రహదారి లేక వర్షాకాలంలో బురదగా మారి నడవటానికి ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. దేవునిగెడ్డ వీధిలో 300 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణ పనులపై వేగవంతానికి దృష్టి సారించాలని వారు కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్మాని మత్స్యకొండంనాయుడు, నాయకులు వంజరి సీతారాంనాయుడు. సెర్రీకి సోమలింగం, వంతాల కృష్ణారావు, మత్స్యకొండ బాబు,రమణి, నాగంనాయుడు, రామచంద్రపాత్రుడు, పద్మ, కొండమ్మ పాల్గొన్నారు.

గొలుగొండలో బోనాల పండగ



బోనాలతో భక్తులు

గొలుగొండ: నవరాత్రుల సందర్భంగా గొలుగొండలో పెద్ద ఎత్తున బోనాల పండగ శనివారం సాయంత్రం నిర్వహించారు. కనకదుర్గ ఆలయం నుంచి వినాయక, మరిడితల్లి, నూకాలమ్మతల్లితో పాటు గ్రామంలో ఉన్న అన్ని దేవాలయాల వద్దకు మహిళలు పెద్ద ఎత్తున వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. నవరాత్రులు సందర్భంగా గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన

చింతపల్లి: మాదకద్రవ్యాలు వినియోగంతో సమాజంతో పాటు కుటుంబాలకు విఘాతం ఏర్పడుతుందని ఈగల్ టీం ఇన్‌స్పెక్టర్ డి.నాగార్జున అన్నారు. శనివారం పెంటపాడు సమీపంలో గల ఎస్ఆర్‌సీ కంపెనీలో పనిచేస్తున్న రోడ్ వర్కర్స్, కాంట్రాక్టులో పనిచేస్తున్న కూలీలకు డ్రగ్స్ వాడకంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాల వాడకం వలన ఏర్పడే ఆరోగ్య సమస్యలు మానసిక ప్రభావాలు, కుటుంబ విబేధాలు వంటి దుష్పరిణామాలను వివరించారు.గంజాయి సాగు, రవాణా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగార్జున

దెబ్బతిన్న వంతెన.. రాకపోకలకు అంతరాయం

- తక్షణమే వంతెన నిర్మించాలని స్థానికుల డిమాండ్

సీలేరు: మండలంలో దారకొండ పంచాయతీ నుంచి చిన్న గంగవరం గ్రామం మీద ఒడిశా వెళ్లే ప్రధాన రహదారిలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇటీవల స్థానికులు నిర్మించుకున్న కర్రల వంతెన కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది ఈ వంతెన పారి విపత్తుకు పూర్తిగా కొట్టుకుపోయింది. అప్పటి నుంచి వంతెన నిర్మించాలని అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నా ఇప్పటివరకు స్పందించలేదని, గత్యంతరం లేక స్థానికులు శ్రమదానంతో ఇటీవల కర్రల వంతెనను నిర్మించుకొని ద్విచక్ర వాహనాలతో పాటు కాలినడకన వెళ్లేందుకు వీలుగా నిర్మించుకున్నారు.అయితే గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ వంతెన కొట్టుకుపోయింది. దీంతో మళ్లీ రాకపోకలు నిలిచిపోయాయి. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఈ వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.



కోతకు గురైన కర్రల వంతెన

చట్టాలు పకడ్బందీగా అమలుచేయాలి



సమావేశంలో పాల్గొన్న ఆదివాసీలు

ఎటపాక: దశాబ్దాల కాలంగా రాజ్యాంగ హక్కులు, రిజర్వేషన్ ఫలాలను లంబాడీలు, గిరిజనేతరులకు దోచిపెడుతూ ఆదివాసీ చట్టాలపై పాలక ప్రభుత్వాలు కుట్రలకు పాల్పడుతున్నాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆరోపించారు.రెండు రాష్ట్రాల కార్యకర్తలతో సమన్వయ సమావేశం లక్ష్మీపురం గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న భద్రాచలంలో జరిగే ధర్మయుద్ధం సభకు రెండు రాష్ట్రాల ఆదివాసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. వెంకటేష్, గోవింద, ఉదయ్, పరమేష్, రామకృష్ణ, రవి, అర్జున్ ఉన్నారు.

